# తన మరణములో ప్రవచనప్పు నెరవేర్చియున్నాడు

ప్రభువైన యేసు యొక్క మరణము, సమాధి, పునరుత్థానములలో ఎంతో స్పష్టంగా పాత నిబంధన ప్రవచనముల నెరవేర్పును మనం చూస్తాం! ఆయన జన్మకుముందే మన రక్షకుని సిలువ మరణం ప్రవచనంలో బయలుపరచబడింది. ఈ ప్రవచనములు వాటి నెరవేర్పుల ఉదాహరణలను పఠించి, దైవికమైన దేవుని కుమారుడైన[1] యేసు క్రీస్తునందు నీ విశ్వాసం పెదుగునట్లుగా పని చేయనిమ్ము.

## సమస్తము తన పాదముల క్రింద కలిగియున్న నరుడు (కీర్తన. 8:4-6)

ఆది. 1:26–28లో, ఆదామును అతని సంతతివారును భూమిమీద ఏలుబడి చేయునట్లు దేవుడు ఆదామునకు ఉత్తరువునిచ్చాడు. కీర్తన. 8 ఆ ఆజ్ఞనెంతో ఎక్కువగా పునరావృత్తి చేస్తుంది. మానవాళికి అనుగ్రహింపబడిన కాపుదలకొరకు దేవుని స్తుతించుచూ, కృతజ్ఞతాస్తుతులు చెల్లించడం కూడా అందులో జరిగింది. 4వ వచనం యిలా అంటుంది,

> నీవు మనుష్యుని జ్ఞాపకము చేసికొనుటకు వాడేపాటివాడు?
> నీవు నరపుత్రుని దర్శించుటకు వాడేపాటివాడు?

విశ్వం యొక్క పరిమాణంతో పోల్చితే, నరుడు బహు అల్పుడు. విశ్వంలో నరుని విలువను వాని పరిమాణాన్ని బట్టి తీర్మానించితే, వాడేపాటివాడు? ఏదియేలాగున్నా, "ఇశ్రాయేలు యొక్క మధుర గాయకునిచే" వ్యక్తపరచబడిన మానవుని హెచ్చు స్థాయి రెండు మార్గాల్లో తెలియబడుతుంది: (1) దేవదూతలకంటె అతడు కొంచెము తక్కువ వాడుగా చేయబడ్డాడు (2) దేవుని చేతి పనులన్నిటి మీదను అతనికి అధికార మియ్యబడింది. ఘనుడగు దేవుడు, "సమస్తమును వానికి లోపరచినప్పుడు వానికి లోపరచకుండ దేనిని విడిచిపెట్టలేదు" (హెబ్రీ. 2:8).

ఆదాము కాలము మొదలుకొని క్రమముగా, నరుడు ప్రతి జంతువును స్వాధీనపరచు కొన్నాడు, సముద్రాన్ని, గాలిని, ఆకాశాన్ని కూడా. తన చుట్టునున్న పరిసరంలో మానవుడు ఎన్ని విజయాలు సాధించాడంటే, సందేహించే జనులు కూడా ఇది చేయలేము, అది చేయలేమని చెప్పజాలనంతగా సాధించాడు.

మానవ పురోభివృద్ధి ఎంతగా జరిగినా, ఆదామునుండి ప్రభువైన యేసు అవతరించే

వరకు జయింపబడని శత్రువు ఒకడు మిగిలిపోయాడు: అది మరణం. ఇద్దరు మనుష్యులు మృతిచెందక పోయినప్పటికి (ఆది. 5:24; 2 రాజులు 2:11) వారు కేవలం మినహా యింపులు మాత్రమే. మనుష్యుడు ఒక్కసారే మృతిపొందవలెనని నియమింపబడింది (హెబ్రీ. 9:27). విశ్వసించే మనుష్యులకు తప్ప, మరణము యొక్క నిశ్చయత విషాద వస్త్రాన్ని వదలి వెళ్లింది. జనులు మరణముయొక్క భయముచేత దాస్యమునకు లోబడి ఉన్నారు (హెబ్రీ. 2:15). పునరుత్థానం యొక్క చదురు మదురు సంఘటనలు (1 రాజులు 17:21, 22; 2 రాజులు 4:35; 13:21) స్థిరమైన నిరీక్షణను ప్రసాదించలేక పోయాయి, ఎందుకంటే బ్రతికింపబడిన ప్రతి ఒక్కడు తిరిగి చనిపోవడం జరిగింది.[2] మరణం యింకా ప్రభుత్వం చేస్తుంది, నరుల దేహాలు క్షయతను చూచాయి. మరణము యొక్క చెరనుండి నరుడు ఎలా విడిపింపబడతాడు? "సమస్తము"ను దేవుడు నరునికి లోబరచియుంచాడా? మానవ అధికారానికి మినహాయింపుగా మహా గొప్ప భీకరమైనది ఏదైనా ఉందా?

దేవుని జ్ఞానంలో, ప్రభువైన యేసు ఈ లోకానికి పంపబడ్డాడు. ఆయన ఎంత మాత్రమును దేవదూతల స్వభావమును  ధరించలేదు. ఆయన అలా ధరించుకొని ఉన్నట్టయితే, సమస్తముపైన "నరునికి" అధికారమిచ్చియున్న దేవుని వాగ్దానములో (ఆది. 1:26; కీర్తన. 8:4) ఆయన చేర్చబడియుండేవాడు కాదు. పైగా, దేవదూతలు మరణించారు (లూకా 20:36). మరణించడం ద్వారా మరణాన్ని నశింపజేయాలనేది పరలోకపు జ్ఞానమైయుంది.

అలాగే, దేవుడు క్రీస్తును రక్తమాంసములలో పాలివానిగా చేసి, మరణానికి లోనైన శరీరధారిగా పంపాడు. "మరణముయొక్క బలముగలవానిని, అనగా అపవాదిని మరణము ద్వారా నశింపజేయడానికి ఆయన కూడా రక్తమాంసాలలో పాలుపొందాడు" (హెబ్రీ. 2:14). ఆయన పునరుత్థానము తక్కిన వాటికంటె భిన్నమైనది, ఎందుకంటే, "మరణం ఆయన మీద యిక ఎన్నడు ప్రభుత్వము చేయదు" (రోమా 6:9). "ఆయన కుళ్లుపట్టడు" (అపొ. 13:34). "నేను జీవించుచున్నాను గనుక మీరును జీవింతురు" అని ఆయన వాగ్దానం చేయగలడు (యోహాను 14:19).

ఇప్పుడు కూడా, అంటే, క్రీస్తు ప్రభువు పునరుత్థానానికి రెండు వేలసంవత్సరాల తరువాత కూడా దేవుడు నరునికి ఆది. 1:26; కీర్తన 8:4ల్లో చేసిన వాగ్దానం యొక్క సంపూర్ణ నెరవేర్పు కన్పించలేదు. ఏదియెలాగున్నా, యిప్పుడు మరణ భయం తొలగి పోయింది, ఎందుకంటే మృతులలోనుండి లేపబడిన క్రీస్తు, మరణముయొక్క తాళపు చెవి కలిగియుండగా (ప్రకటన 1:17, 18), ఆయన ద్వారా మన విజయము నిశ్చయం చేయబడింది. దేవుడు ఆదిలో వాగ్దానం చేసింది జరిగినంతటి నిశ్చయమైనదే! "ఎందు కనగా తన శత్రువులనందరిని తన పాదములక్రింద ఉంచువరకు ఆయన రాజ్యపరిపాలన చేయుచుండవలెను. కడపట నశింపజేయబడు శత్రువు మరణము. దేవుడు సమస్తమును క్రీస్తు పాదముల క్రింద లోబరచియుంచెను" (1 కొరింథీ. 15:25–27ఎ).

ఈ విధంగా ఆదిలో మనుష్యులందరికి చేయబడినట్టుగా కన్పించిన ప్రవచనము కడకు హెచ్చుతగ్గులు లేకుండ, యేసు క్రీస్తను ఒకే ప్రత్యేకమైన మనుష్యుని గూర్చిన ప్రవచనంగా తేలిపోయింది. ఆయన లేకుంటే, తొలిగా ఆదాముతో చేయబడి, తరువాత

కీర్తన రచయిత ద్వారా మరల చెప్పబడిన దేవుని వాగ్దానం నేలను పడిపోయేదే. మన ప్రభువైన యేసుక్రీస్తు ద్వారా మనకు జయమునిచ్చిన దేవునికి కృతజ్ఞతలు! ఆశ్చర్యకరమైన ఆయన ప్రవచన వాక్యమును బట్టి దేవునికి అభినందనలు!

## తృణీకరింపబడిన మూలరాయి (కీర్తన. 118:22, 23)

ప్రభువైన యేసును ఒక కట్టడపు రాయితో పోల్చి, అది తృణీకరింపబడినట్టు కీర్తన. 118:22 ముందుగా సూచించింది:

> ఇల్లు కట్టువారు నిషేధించిన రాయి
> మూలకు తలరాయి ఆయెను.

తన్ను వారు నిరాకరించబోతున్నారని సూచించడానికి ప్రభువైన యేసు ఈ ప్రవచనపు పలుకులను యూదులకు ఎత్తి చూపాడు:

> ఇల్లు కట్టువారు నిషేధించిన రాయి,
> మూలకు తలరాయి ఆయెను;
> ఇది ప్రభువు వలననే కలిగెను,
> ఇది మన కన్నులకు ఆశ్చర్యము
> అను మాట మీరు లేఖనములలో ఎన్నడును చదువలేదా? (మత్తయి 21:42).

కీర్తన. 118:22, 23లో ప్రభువు ఎలాగో, అలాగే, పేతురు యూదుల అధికారులతో మాట్లాడినప్పుడు వర్తింపజేశాడు: "ఇల్లు కట్టువారైన మీరు తృణీకరించిన రాయి ఆయనే" (అపొ. 4:11).

కీర్తన. 118:22, 23తోపాటు, ప్రభువైన యేసును రాతికి పోల్చి పలుకబడిన మరొక ప్రవచనముంది. "అయితే ఆయన ఇశ్రాయేలు యొక్క రెండు కుటుంబములకు తగులు రాయిగాను అభ్యంతరము కలిగించు బండగాను ఉండును యెరూషలేము నివాసులకు బోనుగాను చిక్కు వలగాను ఉండును అనేకులు వాటికి తగిలి తొట్రిల్లుచు పడి కాళ్లు చేతులు విరిగి చిక్కుబడి పట్టబడుదురు" అని సువార్త ప్రవక్త వ్రాశాడు (యెషయా 8:14బి, 15).

"మరియు ఈ రాతిమీద పడువాడు తునకలై పోవును గాని అది ఎవనిమీద పడునో వానిని నలిచేయును" (మత్తయి 21:44) అని ప్రభువు మాట్లాడిన మాటలు యెషయా దేవోక్తిని సూచిస్తున్నట్టుంది. యెషయా యొక్క ప్రవచనాన్ని ప్రభువు ఎంతగా వర్తింప జేశాడంటే, ఆయన యొక్క భావమేమో నిలిచి వింటున్న వారికి అర్థమయ్యింది, "ప్రధాన యాజకులును పరిసయ్యులును ఆయన చెప్పిన ఉపమానములను విని, తమ్మును గూర్చియే చెప్పెనని గ్రహించిరి" (మత్తయి 21:45).

ఇశ్రాయేలీయులు ప్రభువైన యేసును నిరాకరించినప్పుడు యెషయా యొక్క దేవోక్తి నెరవేర్చబడినట్టు తరువాత కాలంలో పౌలు సూచించాడు: "ఇదిగో నేను అడ్డు రాతిని

అడ్డుబండను సీయోనులో స్థాపించుచున్నాను; ఆయనయందు విశ్వాసముంచువాడు సిగ్గుపరచబడడు అని వ్రాయబడిన ప్రకారము వారు అడ్డురాయి తగిలి, తొట్రుపడిరి" (రోమా 9:32బి, 33ఎ).

చివరిగా, తృణీకరింపబడిన రాయిగా ప్రభువును గూర్చి పాత నిబంధనలోనున్న రెండు ప్రవచనాలను పేతురు తన తొలి పత్రికలో ప్రస్తావించాడు:

> ... విశ్వసింపని వారికైతే
> ఇల్లు కట్టువారు ఏ రాతిని నిషేధించిరో
> అదే మూలకు తలరాయి ఆయెను
> మరియు అది అడ్డురాయియు అడ్డుబండయు ఆయెను
> కట్టువారు వాక్యమున కవిధేయులై తొట్రిల్లుచున్నారు;
> దానికే వారు నియమింపబడిరి (1 పేతురు 2:7, 8).

## స్నేహితునిచే అప్పగింపబడ్డాడు (కీర్తన. 41:9)

అబ్షాలోముకు సలహాదారుడైన అహీతోపెలు పాత నిబంధన యూదా అని పిలువ బడ్డాడు. దావీదు, అబ్షాలోము దినములలో అతని సలహాకు విలువ యివ్వబడింది. "... అహీతోపెలు చెప్పిన యే ఆలోచనయైనను ఒకడు దేవుని వద్ద విచారణ చేసి పొందిన ఆలోచనయైనట్టుగా ఉండెను; దావీదును, అబ్షాలోమును దానిని అట్లే యెంచు చుండిరి" (2 సమూ. 16:23). రాజ నగరిలోని విందుశాలలో అహీతోపెలు తరచుగా అతిథియై ఉంటాడనేది నిస్సందేహం. తరువాత, అబ్షాలోముకు సపోర్టు చేస్తూ, అతడు దావీదుకు విరోధియయ్యాడు. ఆస్థాన సలహాదారుడును, సొంతమైన నమ్మకస్థుడునైన వాడు యిలా మారినట్టు దావీదునకు తెలిసినప్పుడు, కీర్తన. 41:9లో తన హృదయంలో చెలరేగిన వేదనను వ్యక్తపరచబడ్డాయి: "నేను నమ్ముకొనిన నా విహితుడు నా యింట భోజనము చేసినవాడు నన్ను తన్నుటకై తన మడిమె నెత్తెను." ఆ మాటలను దాఖలు చేసేలా అతడు ప్రేరేపింపబడ్డాడు.

సొంత స్నేహితునిచే అప్పగించబడడమంటే ప్రభువైన యేసుకు కూడా బాగా తెలుసు. అతడు మోసగించబడేవరకు ఆ పని జరుగుతుందని దావీదుకు తెలియక పోవచ్చు. దీనికి భిన్నంగా, తన శిష్యులలో ఎవడు తనకు విరోధంగా తిరగబడతాడో ప్రభువునకు మొదటినుండి తెలుసు (యోహాను 6:64), తాను అప్పగింపబడక మునుపే ఆయన దానిని గూర్చి మాట్లాడాడు. తన దైవత్వంపట్ల అధిక విశ్వాసం శిష్యులు కలిగియుండేలా, ఏమి సంభవింపబోతుందో ఆయన ముందుగానే వారికి తెలియజేశాడు:

> మిమ్ము నందరినిగూర్చి నేను చెప్పలేదు; నేను ఏర్పరచుకొనినవారిని ఎరుగుదును గాని నాతో కూడా భోజనముచేయువాడు నాకు విరోధముగా తన మడిమ యెత్తెను అను లేఖనము నెరవేరుటకై యిలాగు జరుగును. జరిగినప్పుడు నేనే ఆయనని మీరు నమ్మునట్లు అది జరుగక మునుపు మీతో చెప్పుచున్నాను (యోహాను 13:18, 19).

ఆయన భవిష్యత్ జ్ఞానము తన దైవత్వానికి రుజువైయున్న సంగతిని ప్రభువు నమ్మినట్లు స్పష్టమౌతుంది.

## నమ్మక ద్రోహి డబ్బు నిరాకరించబడింది

## (జెకర్యా 11:13)

తాను చేసిన బేరం విషయంలో విషాదంతో నిండుకొనిన ద్రోహి ఆ రక్తపు డబ్బుతో ఏమి జరిగిస్తాడన్న సంగతి జెకర్యా ప్రత్యేకించి ప్రవచించాడు: "నేను ఆ ముప్పది తులముల వెండిని తీసికొని యెహోవా మందిరములో కుండలుచేయువానికి పారవేసితిని" (జెకర్యా 11:13).

ఈ ప్రాచీన ప్రవచనం యొక్క నెరవేర్పును గూర్చి మత్తయి వర్ణించినది, పరోక్షంగా ఉంది[3]:

> అప్పుడాయనను అప్పగించిన యూదా, ఆయనకు శిక్షవిధింపబడగా చూచి పశ్చాత్తాపపడి, ఆ ముప్పది వెండి నాణెములు ప్రధానయాజకులయొద్దకును పెద్దలయొద్దకును మరల తెచ్చి, – నేను నిరపరాధరక్తమును అప్పగించి పాపము చేసితినని చెప్పెను. వారు – దానితో మాకేమి? నీవే చూచుకొనుమని చెప్పగా అతడు ఆ వెండి నాణెములు దేవాలయములో పారవేసి, పోయి ఉరి పెట్టుకొనెను. ప్రధానయాజకులు ఆ వెండి నాణెములు తీసికొని –ఇవి రక్త క్రయధనము గనుక వీటిని కానుక పెట్టెలో వేయతగదని చెప్పుకొనిరి. కాబట్టి వారు ఆలోచనచేసి వాటినిచ్చి, పరదేశులను పాతిపెట్టుటకు కుండలుచేయువాని పొలము కొనిరి. అందువలన నేటివరకు ఆ పొలము రక్తపు పొలమనబడుచున్నది. అప్పుడు –
> విలువ కట్టబడినవాని, అనగా ఇశ్రాయేలీయులలో
> కొందరు విలువకట్టినవాని క్రయధనమైన ముప్పది
> వెండి నాణెములు తీసికొని ప్రభువు నాకు నియ
> మించినప్రకారము వాటిని కుండలుచేయువాని పొలమునకిచ్చిరి
> అని ప్రవక్తయైన యిర్మీయాద్వారా చెప్పబడిన మాట నెరవేరెను (మత్తయి 27:3-10).

యూదా యొక్క డబ్బు కుండలు చేయువాని పొలాన్ని కొనడానికి వెళ్లింది. "కుండలు చేయువాని పొలము" అనే పేరు బాగా ఎరుకైన స్థలంలా ఉండేదేమో, గతంలో అది కుండలు చేసేవారు ఉపయోగించినదై ఉండవచ్చు. జిగట మట్టి అక్కడ సంపూర్ణంగా వినియోగింపబడిందేమో, మరియు ఆ స్థలము చౌకగా కొనే వీలుకలిగియుండేదేమో.[4]

జెకర్యా ప్రవచనాన్ని మత్తయి యిర్మీయాకు ఆరోపించినట్టు పలు తర్జుమాలను చదవడంవలన ఆశ్చర్యపోవచ్చు. అదే ప్రవచనాన్ని యిర్మీయా నోటి మాటగా పలికియుండ వచ్చునుకూడా, అయితే దాన్ని గ్రంథస్తం చేసియుండకపోవచ్చు. వ్రాయబడిన జెకర్యా యొక్క ప్రవచనాన్ని మత్తయి సూచించియుండే అవకాశమూ ఉంది.

మత్తయి తప్పు లేఖకునికి ఎందుకు ఆరోపించియుంటాడు? నిజానికి మత్తయి చేయలేదు. అతడు పరిశుద్ధాత్మవలన ప్రేరేపింపబడినవాడు గనుక అలాటి దోషం ఎదీ జరిగియుండదు (యోహాను 14:26; 16:13). పైగా, ఆలాటి దోషమే ఒకవేళ అతడు

చేసియుండినట్లయితే, ఆనాటి యూదుల్లోని అవిశ్వాసులు దానిని పట్టుకొని, దాని ఆధారంతో అధికారం చెలాయించేవారే. అలాటి వ్యతిరేకత వచ్చినట్టు ఎరుకలో లేదు.

తర్జుమాల్లో తప్పు ఎలా వచ్చిందంటారు? మత్తయి యొక్క ఒరిజినల్ రచన ఉన్నట్టు కన్పించదు, కేవలం ప్రతులు మాత్రమే మిగిలి పోయాయి, వాటిలో తొలిది మత్తయి తన రచనను చేసిన కాలంలోనే జరిగింది. ప్రతులు కాపి చేసే కొందరు, తాము ఎరుగవలసినట్టు పాత నిబంధన లేఖనాలను ఎరుగక "జెకర్యా" అని వ్రాసేదానికి బదులు "యిర్మీయా" అని వ్రాసియుండవచ్చు. తరువాత కాపి చేసేవారు ఆ దోషాన్ని గమనించినా దిద్దడానికి వెనుకాడి యుండవచ్చు.

కొన్ని ప్రాచీన ప్రతులలో మత్తయి 27:9లో "యిర్మీయా"కు బదులు "జెకర్యా" అనియే ఉంది. మత్తయి ఒరిజినల్ డాక్యుమెంటు యొక్క సరియైన ప్రతులైయుండవచ్చు, పైగా, మత్తయి 27:9ని కొన్ని ప్రాచీన ప్రతులలో, పేరును ప్రస్తావించడం మాని, "ప్రవక్తద్వారా" ప్రవచింపబడినట్లు అని ఉంది. ఈ ప్రతులు మత్తయి యొక్క ఒరిజినల్[5] ప్రతిపాదనను అనుసరించియుండవచ్చు. ఈ విషయం యొక్క వివరణ ఏమైయున్నా, రక్త క్రయధనంతో ఏమి చేయబడుతుంది అనే ప్రవచనం బహు విశేషమయ్యింది.

## ఆయన వస్త్రములు పంచుకున్నారు (కీర్తన. 22:18)

కొన్ని పాత నిబంధన ప్రవచనాలకు రెండు అర్థాలుంటాయి – దగ్గరవి, దూరపువి; ప్రత్యక్షమైనవి, పరోక్షమైనవి; ప్రాథమికమైనవి, మాధ్యమికమైనవి. కొన్నైతే, కేవలం ప్రభువును గూర్చినవే అయ్యుంటాయి. ఉదాహరణకు, కీర్తన 22:18ని ఆలోచించు: "నా వస్త్రములు వారు పంచుకొనుచున్నారు నా అంగీకొరకు చీట్లువేయుచున్నారు." ఈ ప్రవచనం బహు సూటిగానున్నది. సిలువ వేసే కార్యక్రమం నలుగురు సైనికులకు అప్పగించబడేది ముందుగా ఎరిగిన విషయంలా గోచరిస్తుంది; ప్రభువైన యేసు అయిదు వస్త్రాలు ధరించడం వలెనే, నాలుగు వస్త్రాలు నలుగురు సైనికుల మధ్య తేలికగా పంపిణీ చేసికోవచ్చు. కాని అయిదవ వస్త్రము సమస్యను సృష్టించింది. దాన్ని నాలుగు ముక్కలుగా చింపడంవలన నాలుగు తుంపులౌతాయి, వస్త్రం ధరించడానికప్పుడు వీలుకాదు, వారిలో ఎవడో ఒకడు ఆ వస్త్రాన్ని ఉపయోగించుకొనేలా, మేలైన పరిష్కారానికి ఆ సైనికులు వచ్చి చీట్లువేయడానికి తీర్మానించుకొన్నారు, మరియు వారు ఆలాగున చేశారు:

> సైనికులు యేసును సిలువవేసిన తరువాత ఆయన వస్త్రములు తీసికొని, యొక్కొక్క సైనికునికి ఒక్కొక్క భాగము వచ్చునట్లు వాటిని నాలుగు భాగములు చేసిరి. ఆయన అంగీనికూడా తీసికొని, ఆ అంగీకుట్టులేక పైనుండి యావత్తు నేయబడినది గనుక వారు – దానిని చింపక అది ఎవనికి వచ్చునో అని దానికోసము చీట్లు వేయుదమని యొకరితో ఒకరు చెప్పుకొనిరి.
>
> వారు 'నా వస్త్రములు తమతో పంచుకొని నా అంగీ కోసరము చీట్లువేసిరి అను లేఖనము నెరవేరునట్లు ఇది జరిగెను; ఇందుకే సైనికులు ఈలాగు చేసిరి (యోహాను 19:23, 24).

## నరులచే నిందింపబడినవాడు (కీర్తన. 22:6)

దావీదు పాదరక్షలులేనివాడై, పారిపోవువాడై, విలపించువాడైయున్న సమయంలో – షిమీ అతని శపించుతూ, రాళ్లురువ్వుతూ (2 సమూ. 16:5, 6) ఉండగా – యెష్షయి కుమారుడు తానే, "నరులచేత నిందింపబడినవాడను ప్రజలచేత తృణీకరింప బడినవాడను" అని భావించాడు (కీర్తన. 22:6). అతడిలా అన్నాడు,

> నన్ను చూచువారందరు పెదవులు విరిచి తల ఆడించుచు
> నన్ను అపహసించు చున్నారు.
> – యెహోవామీద నీ భారము మోపుము
> ఆయన వానిని విడిపించునేమో
> వాడు ఆయనకు యిష్టుడు గదా ఆయన వానిని తప్పించునెమో అందురు
> (కీర్తన. 22:7, 8).

ప్రవచనమందున దావీదు కుమారుడు అలాగే, "నరులచేత నిందింపబడినవాడు, ప్రజలచేత తృణీకరింపబడినవాడు," ఆయన సిలువ వేయబడినప్పుడు యిది నెరవేరింది:

> ఆ మార్గమున వెళ్లుచుండినవారు తలలూచుచు – దేవాలయమును పడగొట్టి మూడు దినములలో కట్టువాడా, నిన్ను నీవే రక్షించుకొనుము; నీవు దేవుని కుమారుడవైతే సిలువమీదనుండి దిగుమని చెప్పుచు ఆయనను దూషించిరి. ఆలాగే శాస్త్రులును, పెద్దలును ప్రధానయాజకులును కూడా ఆయనను అపహసించుచు – వీడు ఇతరులను రక్షించెను, తన్ను తాను రక్షించుకొనలేడు; ఇశ్రాయేలు రాజుగదా, యిప్పుడు సిలువమీదనుండి దిగిన యెడల వాని నమ్ముదుము. వాడు దేవునియందు విశ్వాసముంచెను, నేను దేవుని కుమారుడనని చెప్పెను గనుక ఆయనకిష్టుడైతే ఆయన ఇప్పుడు వానిని తప్పించునని చెప్పిరి (మత్తయి 27:39–43).

## దప్పిగొనిన వాడు (కీర్తన. 69:21)

అక్రమంగా కష్టపెట్టబడుతూ హీనంగా ఉన్న దినాలలో, దావీదు సహాయకుల కొరకు చూచినా ప్రయోజనం లేకుండా పోయింది. శత్రువులు అతని ఆకలిచే బాధించారు మరియు అతడు దప్పిగొన్నాడు. అవమానకరంగా అతడు *baruth* యివ్వబడ్డాడు, శోకించువారికిచ్చే భోజనం; అయితే అందులో చేదైన గాల్ కలుపుతారు. ఆహా! మనుష్యులు ఎంత క్రూరంగా ఉండగలరో! అప్పుడు, నీటి స్థానంలో, అతనికి చిరక నిచ్చారు: "వారు చేదును నాకు ఆహారముగా పెట్టిరి నాకు దప్పియైనప్పుడు చిరకను త్రాగనిచ్చిరి" (కీర్తన. 69:21).

అక్రమంగా కష్టపెట్టబడిన మరియొకరు, నజరేయుడగు యేసు. సిలువలో వ్రేలాడ దీయబడినప్పుడు ఆయనకు కూడా ఆదరించువారెవరును లేకపోయారు. ఆయన వ్రేలాడదీయబడిన తక్షణమే (ఉదయం రమారమి తొమ్మిది గంటల వేళ) శోధింపబడడానికి ద్రాక్షరసము ఆయనకు యివ్వబడినట్టుంది. అక్రమకారులు హేళనాస్పదంగా ఆ ద్రాక్షారసాన్ని యిచ్చారు; అయితే అది బోళముతో కలుపబడియుంది, దానితో అది

బహు చేదుగాను త్రాగనలవికానిదిగాను చేయబడింది (మార్కు 15:23), గాల్ మరియు వార్మ్‌వుడ్ వంటిదైయుంటుంది. ప్రభువు దానిని త్రాగ నిరాకరించడంలో ఆశ్చర్యంలేదు. దావీదును బాధించినవారివలె తన్ను సిలువ వేసినవారు, గాయాల్లో ఉప్పుపోసినట్టు, బహు క్రూరులై ఆయన వేదనను మరింత అధికం చేయడానికే ఈ పని చేశారు.

ఆరు గంటలు గడిచిపోయాయి. మధ్యాహ్నం రమారమి మూడు గంటలకు, తాను చనిపోబోతున్న సంగతి ప్రభువుకు తెలుసు (యోహాను 19:28). కీర్తన. 69:21లోని భాగం యింకను నెరవేర్చబడవలసిందనియు ఆయన ఎరుగును – "నాకు దప్పిక యైనప్పుడు చిరకను త్రాగనిచ్చిరి" అనేది. ఆయన గాల్‌ను తీసికొన్నాడు కాని చిరకను తీసికోలేదు. అందువలన, "లేఖనము నెరవేర్చబడునట్టు" (యోహాను 19:28), "దప్పిగొనుచున్నాను" అని చెప్పి ఎవరేని ఒకడు తనకు త్రాగుటకు యిచ్చేలా ఆయన పలికాడు. ఈ సమయంలో చౌకబారు చిరక అని పిలువబడే ద్రాక్షారసము ఆయనకు అందించబడింది. తన పెదవులలోనుండి చివరి పలుకులు యిలా వచ్చాయి: "సమాప్త మైనది"; "తండ్రీ, నీ చేతికి నా ఆత్మను అప్పగించుచున్నాను" (యోహాను 19:30; లూకా 23:46).

## దేవుని చిత్తమును జరిగించువాడు (కీర్తన. 40:6-8)

జంతు బలులను అర్పించవలసిందిగా దేవుడు ఇశ్రాయేలీయులకు ఆజ్ఞాపించాడు (లేవీయ. 16). ఆరాధకులు దేవుని, తమ పొరుగు వారిని ప్రేమించినప్పుడు వీటిని దేవుడు ఆనందముతో తిలకించాడు (కీర్తన. 51:19; ద్వితీయో. 10:12, 13, లేవీయ. 19:18; మీకా 6:6–8ని చూడు). ఏదియెలాగున్నా, వ్యక్తిగతమైన ప్రేమ, సమర్పణ, పవిత్రత, దీనమనస్సులేని జంతుబలులను ఇశ్రాయేలీయుల పరిశుద్ధ దేవుడు అసహ్యించు కొనుచున్నాడు (కీర్తన. 51:16, 17; యెషయా 1:11–17; యిర్మీయా 6:20; 7:22, 23; ఆమోసు 5:22–24). అటు జంతువు, యిటు ఆరాధకుడు తానే సంపూర్ణంగా సమర్పించుకునే సూత్రం కీర్తన. 40:6–8 యొక్క మూల దృశ్యాన్ని వివరిస్తుంది:

> బలులనైనను నైవేద్యములనైనను నీవు కోరుటలేదు; నీవు నాకు చెవులు నిర్మించి యున్నావు దహన బలులనైనను పాపపరిహారార్థ బలులనైనను నీవు తెమ్మనలేదు. అప్పుడు – పుస్తకపుచుట్టలో నన్నుగూర్చి వ్రాయబడిన ప్రకారము నేను వచ్చియున్నాను నా దేవా, నీ చిత్తము నెరవేర్చుట నాకు సంతోషము; నీ ధర్మశాస్త్రము నా ఆంతర్యములో నున్నది.

వ్యక్తిగతమైన పవిత్రత, సమర్పణలేకుండ, దేవుడు జంతు బలులనే గాని నైవేద్యమునే గాని కోరలేదు. కపటముతో, వేషధారణతో కూడిన ఆరాధకులనుండి యివ్వబడే దహనబలులు పాపపరిహారార్థ బలులు ఆయన కోరిన దానిని సంతృప్తి పరచనేరవు. ఇప్పటివలె, అప్పుడు కూడా, ప్రతి ఆరాధకుడు హృదయ పూర్వకంగానే ఆయన చిత్తానికి అప్పగించుకోవాలని ఆయన కోరాడు.

కీర్తన. 40లో చిత్రింపబడినవాడు, "ఇదిగో నేను వచ్చియున్నాను" అంటున్నాడు. అంతరంగపు నిర్ణయము విధింపబడి ధర్మశాస్త్రంలో లిఖింపబడియుంది (ద్వితీయో. 10:12, 13; 30:9, 10). నోరు, హృదయము సరిగా ప్రేరణ చేయబడి, తనకు తానే స్వచ్ఛందంగా చేస్తున్నాడు: "నా దేవా, నీ చిత్తము నెరవేర్చుట నాకు సంతోషము; నీ ధర్మశాస్త్రము నా ఆంతర్యములో నున్నది" అంటున్నాడు. ఆలాగున కీర్తన. 40కు లేఖకుడైన దావీదు అట్టి ఆరాధకుడై ఉండి, దేవునికి జంతు బలులకంటె ఎక్కువగా అర్పించువాడై యున్నాడు.

ఏదియెలాగున్నా, యథార్థతతో సహితం జంతు బలులు పాపమును తీసివేయలేని స్థితిలో నిలిచిపోయాయి (హెబ్రీ. 10:3, 4). అవి లెక్కించు దినమును తీసివేయగలవి మాత్రమే (హెబ్రీ. 10:1, 2). అందువలన కీర్తన. 40:6-8 యొక్క రెండవ హెచ్చయిన భావము మీదనే సర్వలోకం యొక్క గమ్యం ఆధారపడింది. క్రీస్తు దేవుని యొక్క చిత్తాన్ని పవిత్రతతోను, యథార్థతతోను జరిగించడం మాత్రమేగాక, దానికిపైన: ఆయన ఒక మానవ దేహాన్ని అర్పణగాను బలిగాను సమర్పించుకున్నాడు (హెబ్రీ. 10:5).

పాత నిబంధనలో ఏ ఆరాధకుడు ఎన్నడు ఊహించనంత హెచ్చయిన వ్యత్యాసమైన భావంతో, ప్రభువైన యేసు మన పక్షంగా బలియవ్వడానికి సిద్ధపడ్డాడు. జగత్తు పునాది వేయబడకమునుపే (1 పేతురు 1:18-20 చూడు), "-గ్రంథపు చుట్టలో నన్నుగూర్చి వ్రాయబడిన ప్రకారము, దేవా, నీ చిత్తము నెరవేర్చుటకు ఇదిగో నేను వచ్చి యున్నాను" అని ఆయన తన తండ్రితో అన్నాడు (హెబ్రీ. 10:7). ప్రభువైన యేసు కొరకు దేహం నిర్మింపబడినప్పుడు, ఆయన యిష్టపూర్వకంగా దానిని సిలువపై అర్పించాడు. దానివలన కలిగిన ఆనందదాయకమైన ఫలితం, "యేసు క్రీస్తు యొక్క శరీరము ఒక్కసారే అర్పింపబడుటచేత ఆ చిత్తమునుబట్టి మనము పరిశుద్ధపరచబడి యున్నాము" (హెబ్రీ. 10:10) అని క్రైస్తవులు ఉత్సాహించేలా చేసింది.

## సర్పం యొక్క తలను చితుక త్రొక్కువాడు (ఆది. 3:15)

స్త్రీ సంతతిని గూర్చి దేవుడు సర్పంతో మాట్లాడుతూ యిలా అన్నాడు, "అది తల మీద నిన్ను కొట్టును; నీవు దానిని మడిమెమీద కొట్టుదువు" (ఆది. 3:15బి). ఇది సర్పాలకు నరులకు మధ్య ఉన్న సహజమైన శత్రుత్వాన్ని గూర్చి మాట్లాడినట్టు భావం అసమంజసమౌతుంది. సాతాను యొక్క నోరుగా సర్పం ఉందన్న విషయం స్పష్టంగా ఉంది. ("అపవాది అనియు సాతాననియు పేరుగల ఆది సర్పమైన ఆ మహా ఘట సర్పం"; ప్రకటన 12:9). అది వాస్తవమైయుండగా, స్త్రీ సంతానానికిని అపవాదికిని (సర్ప సంతానానికిని) మధ్య సంఘర్షణ ఉండబోతుందని దేవుడు ముందుగా సూచించాడు. స్త్రీకి జన్మించిన మొదటి వాడైన కయీను అపవాదితో సంఘర్షణ పడలేదు. అయితే, కయీను అపవాదికి లోబడి, సాతానును, పాపమును అతని ఏలునట్లుగా చేసికొన్నాడు (ఆది. 4:7). కయీను దుష్టుని సంబంధి (1 యోహాను 3:12), తత్ ఫలితంగా, సాతాను తలను చితుక త్రొక్కేలా ప్రవచింపబడిన సంతానం అతడు కాలేకపోయాడు.

స్త్రీ సంతానం యొక్క రెండవ ఉదాహరణ, హేబెలు, సర్వలోకాన్ని మోసపుచ్చే వానితో ఆత్మసంబంధమైన సంఘర్షణలో, ప్రవేశించి, విజయాన్ని సాధించాడు. తన భౌతికమైన ప్రాణాన్ని కోల్పోయినా, ఆ సర్పం యొక్క ఆత్మసంబంధమైన తలను చితుక త్రొక్కాడు. హేబెలు స్త్రీ యొక్క "దైవికమైన సంతతి" (మలాకీ 2:15 చూడు).

దేవుని పక్షంగా నిలిచి, అపవాదిని ఎదిరించి, ఆ మార్గంలో శ్రమననుభవించిన ప్రతిమాదిరియు ఆది. 3:15 యొక్క నెరవేర్పులో భాగమైయున్నట్టు కన్పిస్తుంది. ఏది యెలాగున్నా, ఎంతో అర్థసహితమైన విజయవంతమైన మాదిరి యేసు క్రీస్తే. ఆయన స్త్రీ యందు పుట్టి (గలతీ. 4:4), హవ్వయొక్క సంతానమై యుండెను (లూకా 3:23–38; ఆది. 3:20 చూడు). ఆయన భౌతికమైన మరణం అనుభవించాడు, అందులో అపవాది ఆయన మడిమెను కొట్టెను అని చెప్పవచ్చు, అదే మరణములో మరణముయొక్క బలముగలవానిని అనగా అపవాదిని నశింపజేశాడు (హెబ్రీ. 2:14). నేడు ప్రభువైన యేసు మరణము యొక్కయు పాతాళ లోకము యొక్కయు తాళపుచెవులు తన స్వాధీనంలో ఉంచుకున్నాడు (ప్రకటన 1:18). ఆయన మరణమును నిరర్థకముచేసి జీవమును అక్షయతను సువార్తవలన వెలుగులోనికి తెచ్చాడు (2 తిమోతి 1:10), సర్పం యొక్కయు తలను చితుకగొట్టియే ఆయన కార్యాన్ని జరిగించాడు.

సాతానుయొక్క తలను చితుక త్రొక్కడంలో ప్రతి నీతిమంతుడును ఆత్మసంబంధమైన ఉదాహరణగా నిలిచియుండగా, ప్రభువైన యేసు మాత్రమే మరణాన్ని త్రొక్కాడు. ఈ భావనలో, కేవలం ప్రభువైన యేసు మాత్రమే ఆది. 3:15 యొక్క నెరవేర్పైయున్నాడు. ఈ విషయంలో ప్రభువు యొక్క అతి ప్రత్యేకతనుబట్టి, ఆది. 3:15ను " "*protevan gelium,*" మెస్సీయా రాకను గూర్చిన తొలి ప్రకటనయని బైబిలు పండితులు బహు కాలంగా భావిస్తున్నారు. ఆది. 3:15ను క్రొత్త నిబంధన లేఖకుడు ప్రభువైన యేసుకు ప్రత్యక్షంగా వర్తింపజేయకున్నా, దాని నిరీక్షణ యొక్క వైశాల్యతే ఆ లేఖన భాగాన్ని చూచి ఉలికిపడేలా చేస్తుంది. "అపవాది క్రియలను లయపరచుటకే దేవుని కుమారుడు ప్రత్యక్షమాయే"నంటూ (1 యోహాను 3:8) సాతానుపై నిశ్చయమైన విజయం ఉందనే ప్రవచన పూర్వకమైన నిరీక్షణను అది అందజేస్తుంది.

## విజయ శీలిగా పాపమును భరించినవాడు

## (యెషయా 53)

ఎనిమిది శతాబ్దాలకు ముందుగా, ప్రభువైన యేసు యొక్క మహిమను యెషయా చూచినందున "ఆయనను గూర్చి ఈ మాటలు చెప్పెను" (యోహాను 12:41). యెషయా 53లో స్పష్టమైన వివరాలు, పాఠకులను చరిత్రవైపు తేరి చూచునట్టు చేస్తున్నాయి. ప్రభువైన యేసునుగాక, యింకెవనినైనా చూడడానికి, అవిశ్వాసులు ఆకాశమును, భూమిని, సజీవులను, మృతులను చుట్టివచ్చారు (మోషే, ఉజ్జియా, జెరుబ్బాబెలు, యిర్మీయా, సిద్కియా, యెషయా, యెహోయాకీము మరియు ఇశ్రాయేలుతో సహా) ఈ అధ్యాయంలోని ప్రతిపాదనలకు తగినవాడు (లేక) సరిపోయినవాడు యేసు తప్ప వేరెవ్వడూ లేడు.

పైగా, యెషయా 53 తన్నుగూర్చి మాట్లాడుతున్నట్టు తన జీవితాన్ని అమర్చుకొనడానికి యికను ఎవనికిని సాధ్యం కాదు. యేసును స్పష్టంగా చూచిన ఆ ప్రవక్త ప్రధానంగా కన్పించే వివరాలను ప్రవచించాడు:

1. తృణీకరింపబడినవాడు
(53:3; మత్తయి 27:39-43 చూడు)
2. దుఃఖ క్రాంతుడు
(53:3; మత్తయి 26:38 చూడు)
3. బాధననుభవించినవాడు
(53:3; హెబ్రీ. 4:15 చూడు)
4. తన ప్రజలచే ఎన్నిక చేయబడనివాడు
(53:3; యోహాను 1:10, 11 చూడు)
5. ఇతరుల వ్యసనములను వ్యాధులను అనుభవించినవాడు
(53:4; మత్తయి 8:16, 17 చూడు)
6. ఆయన నోట ఏ కపటమును లేదు
(53:9; 1 పేతురు 2:22 చూడు)
7. బాధింపబడినను ఆయన నోరు తెరువలేదు
(53:7; మత్తయి 26:63; 27:12, 14 చూడు)
8. ఇతరులకొరకు దెబ్బలను సహించినవాడు
(53:5; 1 పేతురు 2:24, 25 చూడు)
9. ఇతరుల పాపమును భరించినవాడు
(53:5, 12; 1 కొరింథీ. 15:3; 2 కొరింథీ. 5:21; హెబ్రీ. 9:28; రోమా 4:25 చూడు)
10. నేరస్థులలో ఒకనిగా ఎంచబడిన వాడు
(53:12; లూకా 22:37 చూడు)
11. అపరాధులకొరకు విజ్ఞాపనము చేసినవాడు
(53:12; లూకా 23:34 చూడు)
12. అన్యాయపు తీర్పు నొందినవాడు
(53:8; మత్తయి 27:24 చూడు)
13. ధనవంతునిచే పాతిపెట్టబడినవాడు
(53:9; మత్తయి 27:57-60 చూడు)
14. మృతులలోనుండి లేపబడినవాడు
(53:10; మార్కు 16:9 చూడు)
15. ఘనుడుగా హెచ్చింపబడి ఘనపరచబడినవాడు
(53:12; ఫిలిప్పీ. 2:9-11 చూడు)

యెషయా 53లో ప్రవక్త తనను గూర్చి మాట్లాడుతున్నాడా లేక ఒకని గూర్చి మాట్లాడు తున్నాడా? అని ఐతియోపీయా దేశపు ప్రభుత్వ అధికారి ఫిలిప్పును అడిగాడు. సువార్తికుని యొక్క జవాబును గ్రహించడం సులభమే: “అందుకు ఫిలిప్పు నోరు తెరచి, లేఖనముల ననుసరించి, అతనికి యేసును గూర్చిన సువార్త ప్రకటించెను” (అపొ. 8:35). అతడు తన నోరు తెరచి లేఖనములను ఎత్తి వేరొకని గూర్చి ప్రకటింపలేకపోయాడు.

## విజయశాలి (కీర్తన. 68:18)

రమ్యమైన అలంకార భాషలో, కీర్తన. 68:18ఎ నందు జయించు రాజుగానున్నట్టు దేవుని దావీదు చిత్రిస్తాడు. ఆ రాజు ఘనత వహించే మహా గొప్ప స్థానానికి వెళ్లుతూ, తన యుద్ధ ఖైదీలను నడిపిస్తూ, తన్ను అభినందించే వారియొద్దనుండి బహుమానాలు పొందుతున్నట్టు అక్కడ వర్ణింపబడ్డాడు:

> నీవు ఆరోహణమైతివి పట్టబడినవారిని పట్టుకొని పోతివి;
> మనుష్యులచేత నీవు కానుకలు తీసికొని యున్నావు.

అదే విధంగా, ప్రభువైన యేసు సమాధిలోనికి దిగి, విజయశాలిగా లేచినప్పుడు, తాను చెరపట్టినవారుగా ఆయన మరణమును, పాతాళమును, సమాధిని పట్టుకొని పోయాడు! ప్రపంచం యొక్క బహు కీలకమైన యుద్ధంలో, సమాధుల మీద సాతానుకున్న బల ప్రభావాన్ని ఆయన ఎత్తి వేశాడు. మరణము యొక్క బలముగల అపవాదిని ఆయన నశింపజేశాడు (హెబ్రీ. 2:14), జీవమును, అక్షయతను సువార్తవలన వెలుగులోనికి తెచ్చాడు (2 తిమోతి 1:10). “నేను జీవించువాడను, మృతుడనైతినిగాని, ఇదిగో, యుగ యుగములు సజీవుడనైయున్నాను. మరియు మరణము యొక్కయు పాతాళలోకము యొక్కయు తాళపు చెవులు నా స్వాధీనములో ఉన్నవి” అంటూ విజయవంతంగా ప్రకటన చేశాడు (ప్రకటన 1:18). ఈ యుగసంబంధమైన దేవతయొక్క ప్రధానులను అధికారులను ఆయన తొలగించి, సిలువయొక్క విజయోత్సవముతో వారిని పట్టి తెచ్చి వేడుకకు కనుపరచాడు (కొలస్సీ. 2:15).

ఆ మహా ఘనమైన విజయం సాధించినప్పటినుండి మాత్రమే మనుష్యులకు మరణ భయం తొలిగిపోయింది (హెబ్రీ. 2:15). మరణంయొక్క ఆధిపత్యం తొలిగిపోయిన కారణాన, “ఓ మరణమా! నీ విజయమెక్కడ? ఓ మరణమా, నీ ముల్లెక్కడ,” అని జనులు మరణాన్ని గూర్చి హేళనగా మాట్లాడవచ్చు (1 కొరింథీ. 15:55). “మన ప్రభువైన యేసు క్రీస్తు మూలముగా మనకు జయము అనుగ్రహించుచున్న దేవునికి స్తోత్రము కలుగును గాక” అని మనం యిప్పుడు ఉత్సాహ ధ్వని చేయవచ్చు (1 కొరింథీ. 15:57). అంతిమ విజయం కొరకు క్రైస్తవులు ఎదురు చూడవచ్చు. అప్పుడు, “ ‘విజయ మందు మరణము మ్రింగివేయబడెను’ అని వ్రాయబడిన వాక్యము నెరవేరును” (1 కొరింథీ. 15:54).

ప్రభువైన యేసు మనకు, చేసిన ఉపకారమునుబట్టి, మనుష్యుల యొద్దనుండి దేవుడు కృతజ్ఞతాస్తుతులు, స్తుతి, అభినందనలు కానుకలుగా పుచ్చుకుంటాడు. ఎఫెసీ. 4:8లో పరిశుద్ధాత్మచేత ప్రేరేపింపబడిన పౌలు దావీదు మాటలను క్రొత్త నిబంధనలో వర్తింప జేయడంలో ఒకే పదాన్ని మార్పు చేశాడు. కానుకలను పుచ్చుకునేదానికి బదులు ప్రభువైన యేసు ఈవులను అనుగ్రహించినట్టు చెప్పబడింది. మరణ విజయుడైన మెస్సీయా దేవుని కుడిపార్శ్వమునకు ఆరోహణుడైన పది దినాలకు ఆయన పరిశుద్ధాత్మను పంపి మనుష్యులకు ఈవులను ప్రసాదించాడు.

ప్రత్యేకించి, తన రాయబారులుగా అపొస్తలులను బలపరచి, వారు యితరుల మీద చేతులుంచి అద్భుత వరములను యివ్వగలవారినిగా శక్తితో నింపాడు. అలాటి ఈవులను పొందినవారు, ప్రవక్తలు సువార్తికులు, కాపరులు, ఉపదేశకులుగా సేవచేయ నారంభించారు (ఎఫెసీ. 4:8–13). పలువిధములైన వరములయొక్క పంపిణీ (1 కొరింథీ. 12:4–11) సువార్తను సిద్ధపరచడానికిని, దేవుని ప్రజలకు క్షేమాభివృద్ధిని కలిగించడానికిని సాధనంగా ఉపయోగింపబడింది (హెబ్రీ. 2:1–4; రోమా 12:3–8).

ఈ వరములు కొద్దికాలమే ఉన్నాయి, అంటే సత్యం సంపూర్ణంగా బయలు పరచబడేవరకు మాత్రమే ఉన్నాయి (యోహాను 16:13; 1 కొరింథీ. 13:8–13). మొదటి శతాబ్దంలోని తాత్కాలికమైన ఆ కాల భాగంలో, ప్రకటింపబడిన దేవుని వాక్యాన్ని స్థిరపరచడంలో దేవుని ఉద్దేశాన్ని అవి చక్కగా నెరవేర్చాయి (మార్కు 16:17–20). రాజులకు రాజుగాను ప్రభువులకు ప్రభువుగాను పరలోకమునకు ఆరోహణుడైన ఆయన అద్భుతవరాలను, భూమీమీదనున్న జనులకు ఆ శక్తులను యిచ్చాడు.

## అమూల్యమైన తలరాయి (యెషయా 28:16)

యూదులలో అనేకులకు, క్రీస్తు తృణీకరింపబడిన, అవసరంలేని కట్టడపు రాయియై యున్నాడు, కాని తక్కిన ప్రజలు ఆయనను అమూల్యమైన తలరాయిగా గుర్తించారు. యెషయా ఈ ప్రవచనాన్ని చేశాడు:

> ప్రభువగు యెహోవా ఈలాగున సెలవిచ్చుచున్నాడు
> – సీయోనులో పునాదిగా రాతిని వేసినవాడను నేనే,
> అది పరిశోధింపబడిన రాయి అమూల్యమైన తలరాయి బహు స్థిరమైన పునాదియైన మూలరాయియై యున్నది విశ్వసించువాడు కలవరపడడు … (యెషయా 28:16).

"… ఈ బండమీద (పేతురు మీదకాదు, అతడు చేసిన పునాది ప్రతిపాదన మీద) నా సంఘమును కట్టుదును అని పేతురుకు తెలిపినప్పుడు, తన దైవత్వాన్ని ప్రభువు క్రైస్తవ్యానికి పునాదిగా ఉపయోగిస్తానని ఆయన ఉదహరించాడు (మత్తయి 16:18ఎ, బి). పాపమునుండి పవిత్రపరచబడిన జనులకు – ఏ మానవ పునాదియు – అది పేతురేగాని, మరి యింకా ఏ యితర పాపియేగాని – చాలిన సపోర్టు యివ్వగలది కాదు. "వేయబడినది తప్ప, మరియొక పునాది ఎవడును వేయనేరడు; ఈ పునాది యేసు క్రీస్తే" (1 కొరింథీ. 3:11). సంఘ నిర్మాణ కార్యక్రమంలో అపొస్తలులు ప్రభువుతో కూడా పని చేస్తూ, అపొస్తలులును ప్రవక్తలును క్రీస్తు ప్రభువును ముఖ్యమైన మూలరాయిగా నిలిపి కట్టనారంభించారు – ఆయనే శోధింపబడిన అమూల్యమైన పునాది రాయియై ఉన్నాడు (ఎఫెసీ. 2:20). ఆయన పూజార్హుడు.

పేతురు యెషయా 28:16ను కోట్ చేస్తూ, ఏర్పరచబడినదియు, అమూల్యమును సజీవమునైన రాయి ఆ ప్రభువేనని పేతురు వివరించాడు. సంఘము యొక్క పునాదిగా పేతురు తనను సూచించుకోలేదు సుమీ! ఆ స్థితిలో ప్రభువైన క్రీస్తును తప్ప మరొకని

అతడు ఆలోచింప లేకపోయాడు:

> – ఇదిగో నేను ముఖ్యమును ఏర్పరచబడినదియు:
> అమూల్యమునగు మూలరాతిని సీయోనులో స్థాపించుచున్నాను;
> ఆయనయందు విశ్వాసముంచువాడు ఏ మాత్రమును సిగ్గుపడడు
> అను మాట లేఖనమందు వ్రాయబడియున్నది. విశ్వసించుచున్న మీకు, ఆయన అమూల్యమైన వాడు; … (1 పేతురు 2:6, 7ఎ).

---

సూచనలు

[1] అప్పగింపబడడం, మరణం, పునరుత్థానం గూర్చిన పాత నిబంధన ప్రవచనాలను యింకా అధికమైనవి "బైబిలు యొక్క దైవ ప్రేరేపణ, అధికారము" అనే శీర్షికలో "ముప్పది వెండి నాణెములకు అమ్మబడడం" (జెకర్యా 11:12), "దేవునిచే విడనాడబడినవాడు" (కీర్తన 22:1), "బ్రతికిన శవము" (కీర్తన. 16:10) అనే ప్రవచనాలున్నాయి. [2] ప్రభువైన యేసు వచ్చిన తరువాత, యితరులు బ్రతికింపబడ్డారు: తబిత (దొర్కా; అపొ. 9:36–42), నాయీనునందలి విధవరాలి కుమారుడు (లూకా 7:11–16); యాయీరు కుమార్తె (మార్కు 5:22, 23, 35–43; లూకా 8:41, 42, 49–56), లాజరు (యోహాను 11:1–45), ప్రభువైన యేసు సిలువ వేయబడినప్పుడు లేచినవారు (మత్తయి 27:50–53), మరియు ఐతుకు (అపొ. 20:9–12). వారిలో ప్రతి ఒక్కరు తిరిగి చనిపోయారు. [3]జెకర్యా ప్రవచనము యొక్క నేరైన నెరవేర్పు ఊహించబడింది. దేవాలయపు అధికారిని *yotser* అంటే, "రూపుదిద్దువాడు, ముందటివాడు, కుండలు చేయువాడు" అని రాస్‌షమ్రా పలకలు తెలుపుతున్నాయి. లోహములను రూపుదిద్దువాడు *yotser* అంటే, అతడు దేవాలయపు కోశాధికారియై యుండవచ్చు, పురావస్తు శాస్త్రపు ఈ బిట్టును ఉపయోగించి జెకర్యా ప్రవచనం యొక్క తర్జుమాను పునర్నిర్మాణం చేస్తుంది, "నేను ఆ ముప్పది వెండి నాణెములను తీసికొని, యెహోవా మందిరములోని ఖజానాలో వేసితిని." ఏదియెలాగున్నా, ఈ వ్యాఖ్యానము సరియైనదైనా, జెకర్యాయొక్క ప్రవచనానికి పరోక్షమైన నెరవేర్పు ఉన్నట్టు మత్తయి మాటలు చూపుతాయి, ఎందుకంటె, యాజకులు యూదా యొక్క ద్రవ్యాన్ని తీసికొని కుండలు చేసేవాని పొలం కొన్నారు. [4]Albert Barnes, *Matthew and Mark,* Notes on the New Testament (N.p., 1949; reprint, Grand Rapids, Mich.: Baker Book House, 1974), 302. [5]జాక్ పి. లూయిస్‌చే చాలా అవకాశాలు సంక్షిప్తం చేయబడ్డాయి. "మత్తయిచే చెప్పబడిన సంయుక్త లేఖన భాగం" జెకర్యా 11:12, 13లను జ్ఞాపకం చేస్తుంది. లేఖనానికి ఉన్న మత్తయి యొక్క రెగ్యులర్ ఫార్మలాలో చెప్పబడింది (1:22ను పోల్చి చూడు). ఇది సెప్టూజంటుకును, మసొరెటెక్ టెక్స్‌ట్‌కును స్వతంత్రంగా ఉంటుంది. మసొరెటెక్‌లో "కుండలు చేయువాడు" అనియు, సెప్టూజంట్‌లో "ధన నిధి" అని ఉంటుంది. ఆ కథనం యిర్మీయా పొలాన్ని కొనడాన్ని జ్ఞాపకం చేస్తుంది (యిర్మీయా 32:6 వగైరాలు), కుండలు చేయువాని యిల్లు దర్శించడం (యిర్మీయా 18:2 వగైరాలు) అపొ. 1:19 వగైరాలు కీర్తన. 69:25 మరియు 109:8 తెలుపుతూ, యూదాకు సంబంధించిన సంగతులను సూచిస్తుంది. యిర్మీయాకు ఈ భాగాన్ని ఆరోపించడంలో ఏర్పడిన సమస్యను పరిష్కరించడానికి ఈ క్రింది సలహాలు కూడా చేర్చబడ్డాయి: (1) వ్రాసేటప్పుడు తప్పు జరిగియుంటుందని, (2) కొందరు ప్రవక్తలకు యిర్మీయా ప్రతినిధిగా ఉన్నాడని అందులో జెకర్యా ఉన్నాడనేది, (3) చదువుకోనివారు (పండితులు కాని వారు) యిర్మీయా అనే పదం చేర్చారని, (4) యింకా ఎక్కడను కన్పించని యిర్మీయా మాటలు జెకర్యా భద్రపరచాడని, (5) ఇద్దరు ప్రవక్తలనుండి వచ్చిన దానిని చెప్పడంలో నమ్మకమై యిర్మీయాకు అది ఆరోపింపబడిందని. ఈ ప్రశ్నకు పరిష్కారం తెలియదు. (*The Gospel According to Matthew,* Part 2, The Living Word Commentary Series [Austin, Tex.: Sweet Publishing Co., 1976; reprint, Abilene, Tex.: ACU Press, 1984], 157).